# భార్యని ప్రేమించండి!

– వాణి శారణ్యయాదేవి

డియర్ సురేష్!

ఎలా వున్నారు? నేను రిప్లై ఇవ్వడం చాలా ఆలస్యం అయింది. సారీ! ఏం చేయను? అనుకోకుండా మా వాళ్ళతో కలసి అన్నవరం వెళ్ళాల్సి వచ్చింది. అక్కడున్నానన్నమాటే గానీ మీనుండి లెటర్ వచ్చిందో, ఫోన్‌లో వచ్చిందోనని ధ్యాసంతా మీమీదే. తలచుకుంటే ఎంతో చిత్రంగా వుంటుంది. కేవలం లెటర్స్‌తో మొదలైన స్నేహం ఇంత అనుబంధంగా పెనవేసుకుపోవడం, మిమ్మల్ని చూడడం, మీతో మాట్లాడడం ఈమూడేళ్ళలో మూడు సార్లే అయినా మీ సుమధుర గళం ఇంకా చెవుల్లో విన్పిస్తూనే వుంటుంది.

అదేంటో చిన్నప్పట్నుంచీ నాతోబాటే పెరిగిన మా బావమీద కన్నా మీమీద అభిమానం ఇంత స్వల్ప పరిచయంలో ఏర్పడడం చిత్రంగా తోస్తుంది నాకు. నాలోని ఈ మార్పు బావ గమనించలేదేమో ఎప్పట్లాగే నాతో ఆత్మీయంగా మాట్లాడుతుంటే నాలో ఏదో గిల్టీనెస్.

మావాళ్ళేమో 'పెళ్ళో' అంటూ గొడవ పెడుతున్నారు. కానీ నాకేమో పెళ్ళంటే ఆసక్తి కలగడంలేదు. పెళ్ళి చేసుకుంటే జీవితంలో ఇక పైకి ఎదగలేనేమో అన్న అనుమానం వ్యక్తం చేసాను. అలాగైనా మరికొంత గ్యాప్ దొరకాలని, దానికి 'మీ బావ సంగతి నీకు తెలీదా? నువ్వు డిగ్రీ కంప్లీట్ చేస్తానంటే సరేనన్నాడు. మీ ఫ్రెండ్‌తో కంబైండ్ స్టడీ చేస్తానంటే తనే స్వయంగా తీసికెళ్లాడు. జాబ్ చేయాలని వుంది అని నువ్వు అనగానే తన పరపతిని, డబ్బుని వెచ్చించి జాబ్ వచ్చేలా చేసాడు. ఇప్పుడు ఎంబిఎ చేస్తానంటే దానిక్కూడా ఒప్పుకున్నాడు.

నువ్వు ఎక్కడ ఏ ప్రోగ్రాంలో పాటలు పాడుతానంటున్నా 'నీ ఇష్టం' అని, అదీ నీ ఇష్టానికే వదిలేస్తున్నాడు. ఇంతగా నిన్నభిమానించేవాడితే మూడు ముళ్ళూ వేయించుకోవడానికింకేం అభ్యంతరం' అంటూ ఒకటే ప్రశ్నలు. ఆ ప్రశ్నలకు నా దగ్గర జవాబులే లేవు. ఎందుకంటే అవన్నీ నిజాలే కాబట్టి.

మూడేళ్ళక్రితమయితే అలాగే పెళ్లికి అంగీకరించి పెళ్ళాడేదాన్నేమోగానీ మీ స్నేహ మాధురి చవిచూసాక, బావతో నా వైవాహిక జీవితాన్ని ఊహించుకోలేకపోతున్నాను.

పెళ్లి కాకుండా నేను, పెళ్లి అయి మీరు బాధపడడం విచిత్రంగా వుంది కదూ.

అన్నట్లు మీ శ్రీమతి ఆరోగ్యం ఎలా వుంది? ఆమె అనారోగ్యం మిమ్మల్నెప్పుడూ తండ్రిని చేయలేనిదని మీరు రాసింది చదివి బాధపడ్డాను. ఎంత చిన్న కోరిక? కానీ విధి నిర్ణయం దాన్ని అసంభవం చేస్తే మరింత బాధ కలిగిస్తుంది. దీనిని గురించి బాధపడకండి. కావ్య కన్యకలను సృష్టించే కవులని గుర్తు చేసుకోండి. మంచి రచనని అందించడం ద్వారా బాధని మరచిపోయే ప్రయత్నం చేయండి.

ఆకాశహర్మ్యాలు నవల మొదలుపెడతానన్నారు? మొదలెట్టారా? లేదా?

ఆంధ్ర తేజస్సు పత్రికలో ఈవారంతో తేజా సీరియల్ అయిపోతుందన్నారు. ఆ సీరియల్ ఒక్కవారం కూడా మిస్ కానివ్వటం లేదు నేనూ, మా కొలీగ్స్ కూడా. మన మధ్య వున్న పరిచయం తెలిసి వాళ్ళు నన్నెంత గొప్పగా ట్రీట్ చేస్తారో తెలుసా?

నేను అప్పుడెప్పుడో ఓ సభలో ఓ గంటపాటు మీతో మాట్లాడగలిగాను. అందుకే మీ ఇంటికొచ్చి కనీసం ఓ రెండు మూడులోజులైనా మీ దంపతులతో గడపాలని చాలా బలంగా అన్పిస్తూ వుంటుంది. ఆ మధుర క్షణాలని జీవితాంతం గుండెల్లో పదిలంగా దాచుకోవాలని ఎంతో ఆశపడుతుంటాను. మరి ఆ ఆశ తీరెదెప్పుడో ఈ ఆశకి. అన్నట్లు ఒక గుడ్ న్యూస్. మొన్న రాగరంజని వాళ్ళు నిర్వహించిన పాటల పోటీలో ఎప్పట్లాగే ఫస్ట్ ప్రైజ్ వచ్చింది. నగదు బహుమానం ఇచ్చారీసారి. ఏం కొనాలో తోచలేదు. ఎందుకంటే మావాళ్ళు నాకు అన్నీ కొనేసి వుంచారు. అందుకే ఆ డబ్బుతో ఓ ముత్యం పొదిగిన గోల్డ్‌రింగ్‌ని మీకోసం కొన్నాను. ఈ వారంలో మా కొలీగ్ హైదరాబాద్ వెడుతున్నారు. ఆయనకి మీ అడ్రస్ ఇచ్చాను. ఆయన్తో పంపించే ఆ చిరుకానుకని స్వీకరించండి. ఆ రింగ్ పంపించడంలో నా స్వార్థం ఉందండోయ్. మీరు రాయడానికి కూర్చున్నప్పుడల్లా చేతికున్న రింగ్ పదేపదే కనిపిస్తూ మంచి రచనలు చేయమని నా మాటగా చెబ్తూ వుంటుందని. నవల పోటీల్లో మీ నవలకి ఫస్ట్‌ప్రైజ్ వచ్చిందిగా మరి నాకు మీరు మంచి ఐస్‌క్రీం పార్టీ ఇవ్వాలి. సరేనా? ఇక వుండనా మరి.

మీ
ఆశ

• • •

డియర్ స్వీట్ ఆశా!

నీ లెటర్ చదవగానే కోపం, బాధా, ఆనందం అన్నీ సమపాళ్లలో కలిగాయి. నువ్వు రిప్లై లేట్ చేసినందుకు కోపం, నేననుకోకుండా వైజాగ్ వచ్చి నిన్ను కలవాలని మీ ఆఫీస్‌కొచ్చి నిరాశతో వెనుదిరగవలసి రావడంతో బాధ, ఇక ఆనందం ఎందుకంటావా? రాగరంజని పోటీలో బహుమతిని గెల్చుకుని ఆ ఆనందంలో నన్ను గుర్తుంచుకుని అందమైన బహుమతిని పంపినందుకు.

కానీ అంత ఖరీదైన బహుమతి ఎందుకు పంపావ్ ఆశా! అది నన్ను నిత్యం శాసిస్తోంది మంచి రచన చేయమంటూ. అందుకే మెనీమెనీ థాంక్స్. మా ఇంటికి మంచిరోజు చూసి నేనే రమ్మని ఆహ్వానిస్తాలే.

కొత్త నవలింకా మొదలెట్టలేదు. కారణం ఎప్పటిదే అనుకో. శ్రీమతి అనారోగ్యం, హాస్పిటల్స్ చుట్టూ తిరగాల్సి వచ్చింది. తిరిగితే తిరిగాలేగానీ మంచి థీమ్ దొరికిందిలే.

తేజా సీరియల్ నీకమితంగా నచ్చుతోందని, ఆ హీరోలో నన్నే చూస్తున్నానని రాశావ్. కానీ ఆ హీరోలా నేను ధైర్యంగా మా ఆవిడకి విడాకులిచ్చి నిన్ను చేపట్టగలనా? ధైర్యం చేయాలనుకున్నా నీ రెస్పాన్స్ ఎలా వుంటుందో. పోనీలే వదిలేయ్. అందని ద్రాక్షపళ్ళు ఆ కోరికలు.

నీకు ప్రైజ్ రావడం చాలా సంతోషాన్ని కలిగించింది. ఆస్తి, అంతస్తు, అందం, చదువు, మంచి జాబ్, మంచి గొంతు అన్నీ నీ సొంతం చేశాడు. వాటన్నింటినీ పొందిన నిన్ను సొంతం చేసుకునే అదృష్టం వున్న మీ బావంటే నాకు అసూయ కలుగుతోంది. బావ నల్లనివాడు అయితేనేం అదృష్టవంతుడతడు.

మీ బావ నీతో ప్రేమను వ్యక్తీకరిస్తూ మాట్లాడడని రాశావ్. అదే ఆ ప్లేస్‌లో నేనుంటే నిన్ను నా గుండెల్లో పొదవుకుని స్వీట్ నథింగ్స్ బోలెడన్ని చెప్పేవాడిని. బహుశా నా జీవితంలో తీరని కోరికేమో!

అన్నట్లు ఈ రెండు మూడు నెలలు నా రచనా వ్యాసంగానికి కామా పెట్టదల్చుకున్నాను. ఎందుకంటే ఇల్లు కట్టాలని ప్లాన్. మా మిసెస్ ప్రస్తుతం వాళ్ళ పుట్టింటికెళ్లింది. తను రాగానే మంచిరోజు చూసి ఇంటి పని

ప్రారంభించాలనుకుంటున్నాను.

ఈసారైనా జవాబు తొందరగా ఇస్తావుగా. అన్నట్లు నీకో ముఖ్య విషయం. నాకు తెల్సిన ప్రొడ్యూసర్‌కి నీ గురించి చెప్పాను చాలా బాగా పాడతావని. ప్లేబాక్ సింగర్‌గా అవకాశం ఇమ్మని. అతను సరేనన్నాడు. నువ్వో మంచి సింగర్‌గా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని నా కోరిక మరి. డబ్బుకి డబ్బు, పేరుకి పేరు వస్తుంది. నన్నడిగితే ఆడపిల్లకి భరతనాట్యం నేర్పించడంకన్నా సంగీతం నేర్పించడం బెటర్. నలుగురి కంట పడే సమస్య వుండదు.

మీ బ్యాంక్ ఆఫీసర్స్‌కి ఇంటి గురించి ఐదారులక్షలవరకు లోన్ ఇస్తారటకదా. అదృష్టవంతురాలివి. ముఖ్యంగా మీ బావే అదృష్టవంతుడులే. ఏ బాధ లేకుండా స్వంత ఇంటి యజమాని అవుతాడు. నేను చూడు ఇల్లు కట్టాలని ప్లాన్ చేసినప్పటినుండి డబ్బు కోసం ఎన్నెన్ని ప్రయత్నాలు చేస్తున్నానో! ఎన్నెన్ని ప్రయాసలు పడుతున్నానో ఆ దేవుడికే తెలియాలి. ఆశా చిన్నమాట. గోల్డ్ లోన్ నాకు వచ్చేలా ఏర్పాటు చేయగలవా? నీకు తెల్సిన వారి ద్వారా. సాధ్యమైతేనే సుమా!

ఈ మధ్య నా మిసెస్‌తో ఓ కొత్త గొడవ మొదలైంది సిల్లీగా. నా ఫాన్స్‌తో నాకు సంబంధాలు అంటగట్టి తను బాధపడుతూ అనవసరంగా నన్నూ బాధపెడుతోంది. చదువులేని మూర్ఖురాల్ని కట్టుకున్నందుకు భగవంతుడు మంచి శిక్షే వేశాడులే. ఖాళీగా వుంటే ఇలాంటి ఆలోచనలే వస్తాయి. ఏ కుట్టుపనో, బ్యాగ్‌లల్లడమో చేస్తే నీ బుర్ర ఖాళీ ఉండదు. నాలుగు డబ్బులూ వస్తాయి అని ఎంత చెప్పినా వినదు. ఇదంతా నా దురదృష్టం. నా వెన్నుతట్టి ప్రోత్సహిస్తూ నన్నుత్సాహపరిచే నీలాంటి అమ్మాయి భార్యగా దొరికితే ఎంత బాగుండేదో! మనస్సు అస్సలు బాలేదు ఆశా. అందుకే ఏవేవో రాసేస్తున్నాను. నీ మనస్సుని నొప్పిస్తే క్షంతవ్యుడ్ని. ఉండనా మరి. ఎప్పుడూ నీవాడయిన

సురేష్

పిఎస్: నువ్వు పంపిన రింగ్ చాలా చాలా బాగుంది. థాంక్స్.

• • •

మిస్టర్ సురేష్!

చాలాకాలం తరువాత లెటర్ రాస్తున్నందుకు ఆశ్చర్యంగా వుంది కదూ. అనుకోకుండా నేను హైదరాబాద్ రావడం తటస్థించడం నా అదృష్టం. మీ గురించి అన్ని వివరాలు తెలుసుకోగలిగినందుకు. అక్కడున్న మా కజిన్ మీ ఇంటి ఎదురుగా వున్న ఇంట్లోకి మూడునెలల క్రితం అద్దెకి వచ్చారు. అక్కడికి వచ్చి మిమ్మల్ని సర్‌ప్రయిజ్ చేసేముందు మీ గురించి క్షుణ్ణంగా తెల్సుకోవాలన్న ఆరాటంతో మీ వివరాలు సేకరించమన్నాను. ఒక్కో విషయం తెలుస్తున్నకొద్దీ గుండె మండిపోయింది. మీలో వున్న లోపం కారణంగా పిల్లలు కలగకుంటే మీ శ్రీమతి రోగిష్టిదన్న కథ అల్లి మీ లోపాన్ని కప్పిపుచ్చుకోవడమేకాక నా సానుభూతిని ఆశిస్తూ నాకు దగ్గర కావాలని అనుకోవడం ఎంత అమానుషం!

మీ శ్రీమతి రాగానే ఇల్లు ప్రారంభిస్తున్నాను అంటే ఆమె అభిప్రాయాలకనుగుణంగా ఇల్లు కట్టేందుకేమో అనుకున్నాను. కానీ ఆమెని కొట్టి మరీ తన పుట్టింటికి డబ్బు తెమ్మని వెళ్ళగొట్టారని తెలిసి నిర్ఘాంతపోయాను. చదువురానిదైనా కట్నం బాగా ఇస్తున్నారనే పెళ్లాడారట. ఇప్పటికీ మీ కోరికలన్నీ అత్తవారిని పీడించే తీర్చుకుంటారని తెలిసి ఇంతటి గోముఖవ్యాఘ్రాలుంటారని ఆశ్చర్యపోతున్నాను. ఆడదాన్ని ఉసురుపెడుతూ పైకెదగడం ఎంత హేయం.

ఆమె భరతనాట్యంలో నిష్ణాతురాలైనా కేవలం మీ అనుమానపు మగబుద్ధివల్ల నాలుగుగోడల మధ్య బందీ అయిపోయిందన్న నిజాన్ని జీర్ణించుకోలేకపోతున్నాను. మీ రచనల్లో మీ అంతటి ఆదర్శవంతుడు మరిలేనట్టు రాస్తారే ఎంతటి ఆత్మవంచన.

నన్ను పెళ్లాడాలని అనుకున్నదెందుకో క్లియర్‌గా తెల్సిపోయింది. మీ మీదున్న అభిమానంతో అంగీకరిస్తాననుకున్నారు. నా ఆస్తిపాస్తులు, నా బ్యాంక్ జాబ్ మిమ్మల్ని అమితంగా ఆకర్షించాయి. అంతేకదా. నయం తొందరపడి ఏ నిర్ణయం తీసుకోకపోవడం మంచిదయింది.

నల్లనివాడన్న చిన్న లోపం తప్పించి మా ఆనంద్ బావలో మీకున్న నల్లబుద్ధులు ఏవీలేవు. నన్ను నన్నుగా ప్రేమించి నన్ను ప్రోత్సహించే హృదయ విశాలత ఉంది. మీ రచనలలోని హీరోలా నిజమయిన నిఖార్సయిన హీరో మా బావ. ఇంటి ఇల్లాలిని గౌరవించే సంస్కారం వున్నవాడు.

మా బావకి లైఫ్ పార్ట్‌నర్ వ్యక్తిత్వానికి విలువనివ్వాలని తెలుసు. కష్టసుఖాలలో బాలెన్స్‌డ్‌గా వ్యవహరించే వ్యక్తి. ఇంకా చెప్పాలంటే కష్టమంటే ఏమిటో, కన్నీళ్ళు అంటే ఏమిటో నాకు తెలియకుండా చూసుకునే మనసున్న మనిషి. అంతేగానీ మీలా తన ఉన్నతికి భార్యని నిచ్చెనలా వాడుకుని ఆ తరువాత తోసిపారేసే రాక్షసుడు కాదు.

అందుకే రంగుకి కాక అంతరంగానికి విలువనిచ్చి బావతో నా పెళ్లికి అంగీకారం తెలిపాను. వచ్చేనెలలోనే మా పెళ్లి. ఇన్నాళ్ళూ నేను మిమ్మల్ని మంచి ఫ్రెండ్‌గా అభిమానించాను. అందుకే చివరగా ఈ ఫ్రెండ్ సలహా 'భార్యకి విలువ ఇవ్వడం నేర్చుకోండి. బంగారంలాంటి భార్యని కాదని కనిపించిన వారివెంట పరుగులెత్తకండి. ప్రేమ పంచండి. ప్రేమ పొందండి. అర్ధాంగిని అర్ధాంగిగా గౌరవించండి. ఆమె ప్రేమని పొందండి. హాయిగా వుండండి. మీ రచనల్లో కనిపించే ఆదర్శం జీవితంలో కూడా కనిపించేలా ప్రవర్తించండి. ఇదే ఆఖరి మాట.

ఇట్లు

శ్రీమతి ఆశా ఆనంద్

★

